విశాలాంధ్ర అనంతపురం

www.visalaandhra.com

కర్నూలు, మంగళవారం 3, అక్టోబర్ 2023

జగన్ చేత్తో బాబుని కాల్చాలని ఏపిలో బీజేపీ పావులు

-టిడిపీని బలహీనపరిచేందుకే ఏపిలో బీజేపీ కుట్రలు...

- ఇండియా కూటమికి బిజెపి భయపడి ఏపిలో అక్రమ కేసులు...

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్..

విశాలాంధ్ర-గుంతకల్లు : అప్రజాస్వామికంగా పోలీసులను ఉపయోగించి అక్రమ కేసులు బనాయించి తెలుగుదేశం పార్టీని బలహీన పరచడానికి బీజేపీ ముఖ్యమంత్రి జగన్ ను ఉపయోగించుకుంటుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ అన్నారు. సోమవారం సిపిఐ పార్టీ కార్యాలయంలో పట్టణ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పట్టణ కార్యదర్శి గోపీనాథ్ అధ్యక్షతన వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ మాట్లాడుతూ...టిడిపి ని బలహీన పరిచే బీజేపీ, వైఎస్ ఆర్ పార్టీల కక్ష సాధింపు చర్యలను ఖండించాలన్నారు.ఆంధ్ర రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధినేత ను, వారి నాయకుల పైనా వరుస కేసులను బనాయించి, ఆ పార్టీని నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తున్న బిజేపి, వైఎస్ఆర్ పార్టీలకు వ్యతిరేకంగా అన్ని పార్టీలు కలసి పోరాడవలసి వచ్చిందని జగదీష్ కార్యకర్తలకు తెలిపారు. అప్రజాస్వామి కంగా పోలీసులను ఉపయోగించి అక్రమ కేసులు బనాయించి తెలుగు దేశంపార్టీని బలహీనపరిచి, ఆస్థానంలో బిజేపి బలపడాలని అందుకే ముఖ్యమంత్రి జగన్ ను ఉపయోగించుకొని, జగన్ భుజంపై తుపాకి పెట్టి చంద్రబాబును కాల్చాలని బిజేపి -ఏపీలో పావులు కదుపుతున్న దని, ప్రజా స్వామ్య హక్కులు కాలరాస్తున్నందు వలనే కమ్యూనిస్టులు కూడా ఈ చర్యలకు వ్యతిరేకంగా పోరాడవలసి వస్తున్నదని జగదీష్ తెలిపారు. బిజేపి కార్పొరేట్ అనుకూల విధానాలు, మతోన్మాద రాజకీయాలు, రాజ్యాంగ సంస్థలను విధ్వంసం, ప్రాంతీయ పార్టీలను బ్లాక్ మెయిల్ చేయడం, ప్రతిపక్ష పార్టీల హక్కులను కాల రాయడం తదితర ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగానూ, ఎన్‌డిఏను అధికారం నుండి దింపి వేయాలనే లక్ష్యంతో ఇండియా కూటమి 30 పార్టీల కలయికతో ఏర్పడినదని, ఈ కూటమిలో టిడిపి, జనసేన పార్టీలు కలిస్తే ఏపి లో కూడా నియంత జగన్ ను గద్దె నుండి దింపడం, ఓడించడం చాలా సులబమ వుతుందన్నారు. అందువల్ల టిడిపి ప్రస్తుతం ఎదుర్కొంటున్న క్లిష్ట సమస్యలలో ఆ పార్టీకి, వారి కార్యకర్తలకు మనం అండగా నిలవాలని కార్యకర్తలకు జగదీష్ ఉద్బోధించారు. ఈ సమావేశంలో నియోజకవర్గం కార్యదర్శి వీరభద్రస్వామి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.చిరంజీవి, రూరల్ మండల కార్యదర్శి రాము రాయల్, పట్టణ సహాయ కార్యదర్శి ఎస్‌ఎండి గౌస్, జిల్లా ప్రజానాట్య మండలి కార్యదర్శి వీసీ కళ్ళా యప్ప, ఏఐటియుసి మండల కార్యదర్శి ఈశ్వరయ్య,వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్, మహిళా సమాఖ్య నాయకురాలు రామాంజనమ్మ.సీపీఐ నియోజికవర్గం సహాయ కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

వెనుకబడిన జిల్లాల్లో అనంత ఫస్ట్..

సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జాఫర్

సమావేశంలో మాట్లాడుతున్న జాఫర్..

విశాలాంధ్ర - జేఎన్టీయూఏ: దశాబ్దాల తరబడి వెనుక బడిన జిల్లాల్లో అనంతపురం ముందంజలో ఉందని సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జాఫర్ పేర్కొన్నారు.ఈ మేరకు జిల్లా కేంద్రంలోని లలిత కళాపరిషత్‌లో సోమవారం వెనకబడిన ప్రాంతాల సమగ్ర అభివృద్ధి రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ఆపార్టీ జిల్లా కార్యదర్శి రాంభూపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి కమ్యూనిస్టులు మిలిటెంట్ ఉద్యమానికి నాంది పలకాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి అనేక ప్రభుత్వాలు అధికారంలోకి వస్తున్నా ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేరడం లేదని ఏకరువు పెట్టారు. పీఏబీఆర్ డ్యాంలో 11 టీఎంసీల నీటిని నిలువు ఉంచుకునే సామర్థ్యం ఉన్నప్పటికీ అధికారులు ప్రజాప్రతినిధుల వైఫల్యంతో కనీసం ఐదు టీఎంసీల నీటి నిల్వలు దాటడం లేదని వైసిపి ప్రభుత్వంపై విరుచుకు పడ్డారు. భారీ వర్షం వస్తే నీటిని ఒడిసిపట్టాలని సూచించే చెప్పే అధికారులు వర్షం లేనప్పుడు త్రాగుసాగు నీటి కోసం ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఎందుకు కృషిచేయరని సూటిగా ప్రశ్నించారు. వైసిపి అధినేత సిఎం జగన్ హామీలు తుంగలో తొక్కి ప్రజలను నిలువునా మోసం చేశాడని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వంతో లోపాయికర ఒప్పందం చేసుకున్న సీఎం జగన్ రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపిలో వైసిపి ప్రభుత్వం ఏర్పడిననాటి నుండి జిల్లాకు పరిశ్రమలు, ప్రాజెక్టులు తీసుకురావడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని మండిపడ్డారు.

3న బ్లాక్ డేను జయప్రదం చేద్దాం...

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి డి. చిన్నప్ప యాదవ్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని, రైతులు రుణభారంతో కృంగిపోతున్నందున రైతు రుణ విమోచన చట్టం తీసుకొచ్చి కేరళ తరహా రుణ విమోచన చట్టం తీసుకురావాలని, వ్యవసాయ విద్యుత్ మోటార్లకు మీటర్లు పెట్టే విధానానికి స్వస్తి పలకాలని, పార్లమెంట్లో పెట్టిన విద్యుత్తు బిల్లును ఉపసంహరించుకోవాలని, 50 సంవత్సరాలు నిండిన ప్రతి రైతుకు నెలకు పెన్షన్ రూ.10 వేల ఇవ్వాలని తదితర డిమాండ్లతో నేడు నిర్వహించనున్న బ్లాక్‌డేను జయప్రదం చేద్దామని అఖిలభారత రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని టవర్ క్లాక్ దగ్గర నిరసన కార్యక్రమం ఉంటుందన్నారు.

సత్యమేవ జయతే దీక్షకు సంఘీభావం

విశాలాంధ్ర-శింగనమల : సత్యమేవ జయతే నిరసన దీక్షకు సిపిఐ సింగనమల నియోజకవర్గం కార్యదర్శి టి.నారాయణస్వామి, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి రాము, జనసేన పార్టీల ఆధ్వర్యంలో సంఘీభావం తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి చొప్ప చంద్ర, జిల్లా సహాయ కార్యదర్శులు బొమ్మన పురుషోత్తమ రెడ్డి, దేవరకొండ జయమ్మ,జిల్లా అధికార ప్రతినిధి సాకే మురళి క్రిష్ణ, మండల కమిటీ అధ్యక్షులు ఎర్రిస్వామి, రామకృష్ణ, తాతయ్య, ఓబులేసు, జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణమూర్తి, మండల నాయకులు గజేంద్ర నాయక పాల్గొన్నారు.

పతనానికి చేరువలో వైసీపీ ప్రభుత్వం

విశాలాంధ్ర-శింగనమల: చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా శింగనమల నియోజకవర్గం కేంద్రంలో రాష్ట్ర జిల్లా కమిటీల పిలుపుమేరకు సత్యమేవ జయతే దీక్షలోద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలంనరసానాయుడు, రాష్ట్రఎస్సీ సెల్ అధ్యక్షులు యం.యస్.రాజు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, గాండ్ల సాధికారిక రాష్ట్ర కన్వీనర్ విశాలాక్షి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు మారుతినాయుడు దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు సిపిఐ నాయకులు సిపిఐ సింగనమల నియోజకవర్గ కార్యదర్శి టి నారాయణస్వామి, రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి రాము, జనసేన నాయకులు సంఘీభావం తెలిపారు.

టీ కొత్తపల్లిలో మహిళల నిరసన

విశాలాంధ్ర-యాడికి: యాడికి మండల పరిధిలోని టీ కొత్తపల్లి గ్రామంలో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా జిల్లా తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు చుక్కలూరు విజయలక్ష్మి ఆధ్వర్యంలో నారా భువనేశ్వరి రాజమండ్రిలో చేపట్టిన నిరాహార దీక్షకు సంఘీభావంగా నిరసన దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని సైకో పోవాలి సైకిల్ రావాలి జై బాబు జై జై బాబు అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రమాదేవి, నాగలక్ష్మి, సత్యవాణి, నిర్మల,మౌనిక, శ్వేత, మహాలక్ష్మి, సావిత్రి,గీత, దేవి తదితర మహిళలు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, పరిమి చరణ్ పాల్గొన్నారు.

ప్రజాగ్రహజ్వాలకు గురికాక తప్పదు

మాజీ శాసనసభ్యులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి

విశాలాంధ్ర-రాప్తాడు: మాజీ సీఎం చంద్రబాబు ఇలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడకపోయినా రాజకీయ కక్షతో సీఎం జగన్ అరెస్టు చేయించి జైలుకు పంపించారని, అధికారం శాశ్వతం కాదని జగన్ రెడ్డి గుర్తుంచుకోవాలని...వచ్చే ఎన్నికల్లో ప్రజాగ్రహ జ్వాలకు గురికాక తప్పదని, అనంతపురం మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి అన్నారు. మాజీ సీఎం నారా చంద్రబాబు జైలులో చేస్తున్న సత్యమేవ జయతే దీక్షకు మద్దతుగా అనంతపురం నగరంలో ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రభాకర్ చౌదరి సత్యాగ్రహ దీక్ష చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ చంద్రబాబును అక్రమ కేసులో ఇరికించి ఇప్పటికే 24 రోజుల పాటు జైలులో ఉంచారని, ప్రజల అగ్రహజ్వాలలు కట్టలు తెంచుకోక మునుపే విడుదల చేయాలన్నారు.

రైతుకు సహాయం చేస్తే జైల్లో పెడతారా

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలుగుదేశం హాయాంలో రైతులకు 90 శాతం సబ్సిడీలతో డ్రిప్పు పరికరాలు సహాయమందిస్తే ఆయన్ను తీసుకువెళ్లి జైల్లో పెడతారా అని బొమ్మనహాల్ మండలం లింగదహాల్ గ్రామానికి చెందిన రైతు గొల్ల గోపాల్ వ్యాఖ్యనించారు. సోమవారం రాయదుర్గంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద టిడిపి యాదవుల ఆధ్వర్యంలో వీలే దీక్షలు నిర్వహించారు. ఈ దీక్ష లో బొమ్మనహాల్ మండలం నుండి టిడిపి యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మోడీకి మంచి బుద్ధి ప్రసాదించాలి

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని పోలీస్ స్టేషన్ సర్కిల్లో ఉన్న మహాత్మా గాంధీజీ విగ్రహానికి సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టి. రంగయ్య గాంధీజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి, ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలో అనంతపురం జిల్లా ఎడారిగా మారిందని అన్నారు. జిల్లాకు ఉపాధి హామీ పథకానికి నిధులు పెద్ద ఎత్తున కేటాయించాలన్నారు.

మహాత్ముడి బాటలో నడుద్దాం..

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం : జాతిపిత మహాత్మా గాంధీ బాటలో మనమందరం నడవాలని కలెక్టర్ ఎం.గౌతమి పిలుపునిచ్చారు. సోమవారం పాతవూరు గాంధీ సర్కిల్లో జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అంతకుముందు మహాత్ముడి విగ్రహానికి అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, ఆర్టీసీ రీజనల్ డైరెక్టర్ మంజుల, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పుడు మనం స్వతంత్రం, స్వేచ్ఛ, గాలి పిలుస్తున్నామంటే అది ఎంతోమంది మహనీయులు పెట్టిన భిక్ష అని అన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, మాజీ ఏడిసిసి బ్యాంక్ చైర్పర్సన్ పామిడి వీరాంజనేయులు, తహసీల్దార్ శ్రీధర్ మూర్తి పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న జెఎన్‌టీయూ రిజిస్ట్రార్ ఆచార్య శశిధర్..

ఖైదీలకు సహకారాలు అందిస్తాం ..

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: మండలంలోని ఖైదీల వ్యవసాయ క్షేత్రంలో మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఖైదీల సంక్షేమ దినోత్సవం కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి మరియు ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి జి.దీన, నాబార్డ్ జిల్లా డెవలప్మెంట్ మేనేజర్ కె.అనురాధ, ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎ.హనుమంతు, ఖైదీల వ్యవసాయ క్షేత్రం పర్యవేక్షణాధికారి కే.చిన్నారావు తదితరులతో కలిసి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్ముడు పాటించిన విలువలను పాటిస్తూ ప్రతి ఒక్కరూ ఆయన బాటలో నడవాలన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో కష్టాలు ఉంటాయని, ఖైదీలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

జాతిపిత ఆశయాలను సాధిద్దాం

విశాలాంధ్ర - జెఎన్టియుఏ: జాతిపిత మహాత్ముడి ఆశయాలను సాధిద్దామని రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్ పేర్కొన్నారు. సోమవారం జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో మహాత్మ గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను పరిపాలన భవనంలో ఘనంగా నిర్వహించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ గాంధీజీ బ్రిటీష్ వలస పాలకులపై అహింసాయుతంగా పోరాడి స్వాతంత్ర్యం సాధించడానికి దేశ ప్రజలను ఒక్క తాటిపై నడిపించిన మహానుభావుడని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ అరుణ క్రాంతి, యూనివర్సిటీ డైరెక్టర్లు ఆచార్య జి.వి. సుబ్బా రెడ్డి, ఆచార్య బి.దుర్గా ప్రసాద్, ఆచార్య ఎ. సురేష్ బాబు, ఆచార్య బి. చంద్ర మోహన్ రెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఇ. అరుణ కాంతి, ఆచార్య యన్.చంద్ర మోహన్ రెడ్డి, డాక్టర్ డి.విష్ణు వర్ధన్, ఆచార్య వి.శంకర్, శ్రీ.డి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

పెనుగొండ సిపిఐ ఆధ్వర్యంలో..

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ పట్టణంలో సోమవారం మహాత్మా గాంధీ జయంతి, జై జవాన్ జై కిసాన్ నినాదాలు ఇచ్చిన మాజీ ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి జన్మదిన సందర్భంగా గాంధీ విగ్రహం ఎదుట ఇద్దరి నాయకులకు సిపిఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు నేతృత్వంలో సిపిఐ కార్యకర్తలు నివాళులర్పించారు. వారు దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నరసింహ, వెంకటేశ్వర్లు, కిష్టప్ప, జాఫర్, వెంకటేష్, రాములు, వెంకట, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం టీడీపీ నిరసన దీక్షలో పాల్గొన్నారు.

పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో.. మాట్లాడుతున్న ఎస్పీ

విశాలాంధ్ర-రాప్తాడు..

కుటుంబ సభ్యులకు న్యాయం చేయలేని జగన్ రాష్ట్ర ప్రజానీకానికి ఏం చేస్తాడు...

- మాజీ మంత్రి పరిటాల సునీత..

విశాలాంధ్ర-రాప్తాడు: రాష్ట్రానికి ఏదో చేశానని చెప్పుకుంటున్న జగన్ రెడ్డి.. తన సొంత చెల్లికి న్యాయం చేయలేదన్నారు. సొంత బాబాయిని చంపితే.. చెల్లికి న్యాయం చేయకుండా ఇంకొకరికి కొమ్ముకాశాడని.. రాష్ట్రంలో పోలీసులు ఇలాంటి వారిని అరెస్టులు చేయరు కానీ.. నీతిగా బ్రతికిన చంద్రబాబును, దానిపై పోరాటాలు చేసే మా లాంటి వారిని అరెస్టులు చేస్తున్నారని మాజీ మంత్రి పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం చంద్రబాబు అరెస్టుకు నిరసనగా అనంతపురం రూరల్ పరిధిలోని సిండికేట్ నగర్ లో పార్టీ అధిష్టానం పిలుపుమేరకు ఆమె సత్యమేవ జయతే దీక్ష చేపట్టారు. పరిటాల సునీత మాట్లాడుతూ మహాత్మ గాంధీజీ జన్మించిన రోజున దేశమంతా పండుగ చేసుకుంటుంటే.. ఏపీలో మాత్రం దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా దీక్షలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జగన్ పాలనకు వ్యతిరేకంగా అన్ని వర్గాల వారు తమకు మద్దతు తెలుపుతున్నారన్నారు. గాంధీ జయంతి రోజును దేశమంతా ఘనంగా జరుపుకుంటోందని, అయితే మన రాష్ట్రంలో మాత్రం న్యాయం కోసం రోడ్డెక్కి దీక్షలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రూ.లక్ష కోట్లు అవినీతి చేసి...16నెలలు జైల్లో ఉండి.. 10ఏళ్లుగా బెయిల్ పై తిరుగుతున్న వ్యక్తి రాష్ట్రాన్ని పాలిస్తున్నారన్నారు. అదే రాష్ట్రంలో 45ఏళ్ల తన జీవితాన్ని త్యాగం చేసిన వ్యక్తి జైల్లో ఉన్నాడన్నారు. న్యాయం జైల్లో ఉంటే.. అన్యాయం రాజ్యమేలడం అనేది ఇదేనన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

- అనంతపురంలో సేవ్ జర్నలిజం డే - గాంధీ విగ్రహం వరకు ర్యాలీ

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం : ఐజేయు ఆదేశాల మేరకు అనంతపురంలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో సోమవారం సేవ్ జర్నలిజం డే నిర్వహించారు. ప్రెస్ క్లబ్ వద్ద నుంచి ర్యాలీ గా వెళ్లి మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం గాంధీ విగ్రహానికి విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ పయ్యావుల ప్రవీణ్ మాట్లాడుతూ యాజమాన్యం మార్పులతో పత్రిక స్వేచ్ఛ తగ్గిపోయిందని విలేకరులపై ఒత్తిడి పెరిగిందని వర్కింగ్ జర్నలిస్ట్ చట్టం రద్దు వేజ్ బోర్డు రద్దు దురదృష్టకరమని అన్నారు. సోషల్ మీడియా విస్తరణతో కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి అన్నారు. జర్నలిస్టు సంఖ్య పెరిగిన మన రాష్ట్రంలో అర్హులైన 12000 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్లో నిరాకరించడం బాధాకరమన్నారు. కరానా తో మృతి చెందిన జర్నలిస్టులకు ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేస్తామని జీవో ఇచ్చిన అనంతరం కూడా ఆ నిధులు విడుదల చేయలేదని విమర్శించారు. తక్షణమే ఆ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలని రైల్వే లో నిలిపివేసిన జర్నలిస్ట్ పాసులను పునరుద్ధరించాలని ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐజేయు సభ్యులు ప్రభాకర్ నాయుడు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రసూల్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ సభ్యులు లోకరాజు, చౌడప్ప, చలపతి, కేపీ కుమార్, సీనియర్ జర్నలిస్టులు, వెటరన్ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

పత్రికలకు స్వేచ్ఛ హరించొద్దు

విశాలాంధ్ర-గుంతకల్లు : జర్నలిస్టులపై దాడులను నిరసిస్తూ గుంతకల్లులో ధర్నాకు టిడిపి, సీపీఐ, సీపీఎం, జనసేన ప్రజా సంఘాలు సంఘీ భావం తెలిపారు. సోమవారం గుంతకల్లులో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులపై దాడులు నిరసిస్తూ గాంధీ విగ్రహం ఎదుట పాత్రికేయులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆంధ్రజ్యోతి రిపోర్టర్ రఫిక్, విశాలాంధ్ర రిపోర్టర్ వెంకటరాముడు అధ్యక్షతన వహించారు.

సేవ్ జర్నలిజం..

విశాలాంధ్ర-రాయదుర్గం : జర్నలిస్టుల పై దాడులు ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదమని ఏపీయూడబ్లూజే జిల్లా కో కన్వీనర్ షేక్ మహమ్మద్ అయుబ్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం గాంధీ జయంతి సందర్భంగా రాయదుర్గం పట్టణం లోని గాంధీ విగ్రహం ముందు ఏపీయూడబ్లూజే ఆధ్వర్యంలో సేవ్ జర్నలిజం డే నిర్వహించారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, అక్రమ కేసులకు నిరసిస్తూ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, సమస్యల వినతిపత్రాన్ని సమర్పించారు. ఫ్లెకార్డులను ప్రదర్శించి నినాదాలు చేశారు. నాలుగున్నరేళ్ళుగా రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కాలేదని, అడ్డగోలు నిబంధనల కారణంగా అక్రెడిటేషన్ అరకొరగా జారీ అయ్యిందన్నారు.

దాడులు అరికట్టాలి

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు అరికట్టాలని కళ్యాణదుర్గంలో సోమవారం జర్నలిస్టులు ఐక్యత చాటుతూ ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఐజేయు పిలుపుతో కళ్యాణదుర్గంలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్ర మంలో ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులు హాజరై ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం జర్నలిజాన్ని పరిరక్షించుకుందాం అంటూ నినాదాలు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టులకు అందించాల్సిన సంక్షేమ పథకాలను తూచా తప్పకుండా అందించాలని కోరారు. , అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరారు.

గాంధీజీ ఆశయాలను తుంగలో తొక్కారు..జాఫర్

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: దేశంలో మత సామరస్యాన్ని కాపాడేందుకు జాతిపిత మహాత్మాగాంధీ చేసిన కృషి మరువలేనిదని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ అన్నారు. సోమవారం ఆపార్టీ నగర సమితి ఆధ్వర్యంలో మహాత్మా గాంధి జయంతిని నిర్వహించారు. నగర అధ్యక్షుడు శ్రీరాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జాఫర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా టవర్ క్లాక్ కూడలిలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటు కేంద్రంలోను ఇటు రాష్ట్రంలోనూ మతోన్మాద నియంతృత్వ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం గాంధీజీని విస్మరించి గాడ్సే విధానాలను కొనసాగిస్తుందని దేశ వ్యాప్తంగా మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలే ఇందుకు నిదర్శనమని కేంద్రంపై విరుచుకుపడ్డారు. 1947 అనంతరం విభజన సమయంలో దేశంలోని అనేక ప్రాంతాల్లో మారణ హెూమాలు జరిగాయని విచారం వ్యక్తం చేశారు. ఆయా ప్రాంతాలను మహాత్మ గాంధీ సందర్శించి మత సామరస్యాన్ని కాపాడేందుకు తీవ్ర ప్రయత్నం చేశాడని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు లింగమయ్య,కేశవ రెడ్డి,పద్మావతి, రాజేష్ గౌడ్, ఏపీ మహిళా సమాఖ్య,నగర సమితి పాల్గొన్నారు.

పోలీస్ కార్యాలయం స్పందనకు 25 పిటీషన్లు

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ శ్రీ కేకేఎన్ అన్బురాజన్ సోమవారం నిర్వహించిన " స్పందన " కార్యక్రమంలో 25 పిటీషన్లు స్వీకరించారు. ప్రతీ పిటీషనర్‌తో జిల్లా ఎస్పీ మాట్లాడారు. జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి స్పందన పిటీషన్లకు పరిష్కారం చూపాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. సమస్యలుంటే జిల్లా పోలీసు స్పందన విభాగం 9392926803 కు తెలియజేయవచ్చు అన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 3, అక్టోబర్ 2023

జగనన్న కాలనీలో గృహనిర్మాణాలు ఎక్కడ..

సీపీఐ నాయకులు

నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు ..

విశాలాంధ్ర-నల్లమాడ: మండల కేంద్రంలోని పోతులకుంట పోతులకుంట సమీపంలో పేదలకు భూములను పంపిణీ చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతుల ద్వారా భూములను కొనుగోలు చేసి 3 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు ఒక్క ఇంటిపునాది కూడా వేయలేదని అన్నారు. సోమవారం సీపీఐ మండల కమిటీ కార్యదర్శి వెంకటరమణ పుట్టపర్తి నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు అధ్వర్యంలో జగనన్న లేవుట్‌లో సిపిఐ నాయకులు నిరసన తెలియ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ పుట్టపర్తి నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ నల్లమాడ మండలకేంద్రంలోని కాలనీ ఏర్పాటు చేస్తామని 3 సంవత్సరాలుగా ప్రభుత్వం రైతులవద్ద నుంచి 30 ఏకారాలుకు పైగా భూమిని సేకరించిందన్నారు. వాటికోసం క్లిన్ చేయడం కోసం ప్రభుత్వం నుంచి కూడా రూ.50 లక్షలకు పైగా నిధులు మంజూరు అయ్యాయని, అయినా ఇంటి నిర్మాణాలుగాని, సౌకర్యలు గానీ ఏమాత్రం జరగలేదని ఆరోపించారు. ఎమ్మెల్యేకి గాని అధికారులకు కాని ఏమాత్రం చిత్తశుద్ధి లేదని పేర్కొన్నారు. చాలామంది పేదలు ఎప్పుడెప్పుడు జగనన్న కాలానీలో నిర్మాణాలు చేపడతారని చాలామంది బాడుగలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇంక 6 నెలలో ఎన్ని ఇళ్లు కట్టించారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, అధికారులు కళ్లు తెరచి ఇంటి నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు, నాగేంద్ర,. గంగాద్రి, .ఆదిలక్ష్మి,. ఆటో సూరి తదిరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి ఆపరేషన్‌కు 150 మంది ఎంపిక

విశాలాంధ్ర-రాయదుర్గం : పట్టణంలోని బళ్లారి రోడ్డు బస్టాండ్ ఎదురుగా ఉన్న జామియా మహమ్మ దీయ అరబిక్ కాలేజీలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు, జమీయత్ ఏ అహలే హదీస్ అధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు అ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అమీన్, తెలిపారు. బళ్ళారి కి చెందిన ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేయగా మొత్తం 550 మంది పేర్లు నమోదు చేసుకున్నారు, అందులో 150 మందికి కంటి ఆపరేషన్‌కు ఎంపిక అయ్యారు. ఎంపికైన వారికి తమ కమిటీ వారే ప్రత్యేక వాహనంలో తీసికెళ్లి ఆపరేషన్ చేయిస్తామని, అనంతరం వారికి కావాల్సిన మందులు, భోజనాలు లాంటి సదుపాయాలు కమిటీ వారే ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రెసిడెంట్ **మహమ్మద్ అమీన్ మదని, ట్రెజరర్:-** సయ్యద్ నజీరుల్ హక్, క్యాషియర్ మహమ్మద్ మసూద్ వీరితో పాటు మత గురువులు ఖజీ అతార్ రెహమాన్,అష్రఫ్ ఫైజి, అజీమ్ మౌలీ సాబ్,మత పెద్దలు అమీర్ హంజా, రిటైర్డ్ ఉపాధ్యాయులు అబ్దుల్ బారి, అబ్దుల్ ఖాలీక్, రెడీమేడ్ సనావుల్లా, యువకులు వాలంటీర్స్‌గా సేవలు అందించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులను మరువరాదు

విశాలాంధ్ర-ధర్మవరం: స్వాతంత్ర సమరయోధులను మరువరాదని, వారి అడుగుజాడల్లో యువతీ యువకులు ముందుకు నడవాలని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మనోహర్ గుప్తా, అధ్యక్షులు తల్లం నారాయణ మూర్తి, కార్యదర్శి చిన్నప్ప, కోశాధికారి కృష్ణయ్య, ఉపాధ్యక్షులు జింక చిన్నప్ప తెలిపారు. సోమవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని గొట్లురు అనాధాశ్రమంలో అల్పాహారంతో పాటు పండ్లను వృద్ధులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి మంజునాథ్ జిల్లా చైర్మన్ రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పురాతన శివాలయంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-ముదిగుబ్బ: ముదిగుబ్బ మండలం గుంజేపల్లి గ్రామం సమీపాన ఉన్న కన్య కళ గొందిలో, మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ వర్గీయులు, పురాతన శివాలయంలో నారా చంద్రబాబు నాయుడు పేరు మీద పూజలు చేయించి, కడిగిన ముత్యాల బయటకు రావాలని ఈశ్వరున్ని ప్రార్థించి, 108 కొబ్బరికాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో కంఠ గాని నారాయణస్వామి, దేవేందర్ రెడ్డి, గణపర్తి లక్ష్మీనారాయణ, రెడ్డప్ప, జయ కృష్ణ, పీసిరేవు రామాంజి, ల్యాబ్ నారాయణస్వామి, సురేష్ రెడ్డి,లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విష్ణువర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-ధర్మవరం: బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సోముగట్ట.విష్ణువర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ధర్మవరం పట్టణం రామ్‌నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్ నందు బిజెపి నాయకులు ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ విద్యార్థి పరిషత్ నుంచి రాజకీయ జీవితం ప్రారంభించిన విష్ణువర్ధన్ రెడ్డి బిజెపిలో ప్రవేశించి పార్టీ ఏపని అప్పగించినా అంకిత భావంతో పనిచేస్తూ గుర్తింపు తెచ్చుకొన్నారని అన్నారు. కదిరి నియోజకవర్గం సోమగుట్ట గ్రామం లాంటి మారుమూల ప్రాంతం నుంచి అఖిలభారత స్థాయికి ఎదిగి, ఎంతోమంది యువత కి నూతన కార్యకర్తలకి ఆదర్శంగా నిలుస్తున్నారు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జింకా చంద్రశేఖర్, జిల్లా ప్రధాన సాకే. ఓబిలేసు,వీవర్ సెల్ రాష్ట్ర కమిటీ సభ్యులు గుండా. పుల్లయ్య,అసెంబ్లీ కో. కన్వీనర్ చట్టా. నారాయణ స్వామి, సోషల్ మీడియా కన్వీనర్ జల్లా. కార్తీక్ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు విస్తరించాలి..

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రజలకు రోటరీ క్లబ్ ద్వారా సేవలు మరింతగా విస్తరింప చేయాలని జిల్లా రోటరీ క్లబ్ గవర్నర్ మానిక్ పవార్ తెలిపారు. పట్టణంలోని సాంస్కృతిక మండలిలో రోటరీ క్లబ్ పర్యటించారు. ఈ సందర్భంగా మానిక్ పవార్‌తో పాటు, ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ చిన్నపరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానిక్ పవార్ మాట్లాడుతూ దేశస్థాయిలో రోటరీ క్లబ్‌కు ఎంతో మంచి గుర్తింపు ఉందని, ఇలాంటి రోటరీ క్లబ్ ధర్మవరం పట్టణంలో విశేష సేవలు అందించడం నాకెంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. ఈనెల 8వ తేదీన నిర్వహించబడే ఐ క్యాంపు కరపత్రాలను విడుదల చేశారు. తదుపరి రోటరీ క్లబ్ కమిటీ వారు మానిక్ పవార్, ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ చిన్నపరెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ హిందూపురం అసిస్టెంట్ గవర్నర్ తిమ్మారెడ్డిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు జయసింహ, కార్యదర్శి నాగభూషణం, కోశాధికారి సుదర్శన్ గుప్తా, సోలిగాళ్ళ వెంకటేశులు వెంకటేశులు, ప్రసన్నకువర్ పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనమివ్వాలి

విశాలాంధ్ర-ధర్మవరం : సమానమైన పనికి సమానమైన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్, ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నాగ రాజు పేర్కొన్నారు. సోమవారం స్థానిక గాంధీ పార్కు వద్ద గల మాస్టర్ పాయింట్ నుంచి ర్యాలీగా బయల్దేరి కళాజ్యోతి సర్కిల్. కాలేజ్ సర్కిల్. ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా గాంధీ నగర్‌లోని. గాంధీ విగ్రహం వరకు నినాదాలు చేసుకుంటూ చేరుకోవడం జరిగింది. అనంతరం సిఐటియూ ప్రధాన కార్యదర్శి. అయూబ్ ఖాన్. సిఐటియు జిల్లా కమిటీ నాయకులు. ఎస్ బాబా వాలి, స్థానిక ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు. మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు నిలబెట్టు కోవాలని డిమాండ్ చేశారు. జిల్లా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రెండవ మహాసభలను ఈనెల 5వతేదీ స్థానిక ధర్మవరంలో నిర్వహించనున్నట్లు, కార్యక్రమానికి మున్సిపాలిటీ రాష్ట్రకమిటీ అధ్యక్ష కార్యదర్శులు కె.నాగభూషణం, కె.ఉమామహేశ్వరరావు హాజరవుతున్నారు అని తెలిపారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శులు. నాగేంద్ర, చౌడప్ప, పరమేష్, మున్సిపల్ కార్మిక సంఘం గౌరవ సలహాదారుడు వెంకటేష్, అధ్యక్షులు బాబు, పుల్లన్న, ఉపాధ్యక్షుడు ప్రసాద్, ముత్యాలప్ప, ధనరాజ్, తదితర నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలకు కృషి చేయాలి

విశాలాంధ్ర-ధర్మవరం: మహాత్మా గాంధీజీ ఆశయ సాధనాల కొరకు అందరూ కృషి చేయాలని లైన్స్ క్లబ్ అధ్యక్షులు మోహన్ దాస్ తెలిపారు. సోమవారం గాంధీజీ జయంతి వేడుకలను ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించారు. తొలుత గాంధీజీ చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మోహన్‌దాస్ మాట్లాడుతూ గాంధీజీ మార్గం ఆచరణీయమని, గాంధీజీ ఆశయాలను నెరవేర్చడంలో పాలకుల్లో చిత్తశుద్ధి లోపించడం బాధాకరమన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్బు సభ్యులు సాగా సురేష్, వుట్టి వరప్రసాద్, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బ్రిటీష్ రూల్ పోయింది.. సైకో రూల్ వచ్చింది : పరిటాల శ్రీరామ్

విశాలాంధ్ర-ధర్మవరం: నేడు ఆంధ్రప్రదేశ్లో బ్రిటిష్ రూల్ పోయిందని సైకో రూల్ వచ్చిందని నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. సోమవారం సత్యమేవ జయతే దీక్షలో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గాంధీజీ బ్రతికి ఉంటే.. రాష్ట్ర పరిస్థితి చూసి గుండెపగిలి చని పోయే వారని అన్నారు. ప్రజలంతా ఈ దుర్మార్గపు పాలన గురించి ఆలోచిం చాలని అన్నారు. చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో గాంధీ జయంతి సందర్భంగా పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ధర్మవరంలో సత్యమేవ జయతే దీక్షా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పరిటాల శ్రీరామ్‌గాంధీ సర్కిల్లో ఉన్న మహాత్ముని విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ రోజు జగన్ సైకో పనుల వల్ల చంద్రబాబు అన్యాయంగా జైల్లో ఉన్నారు. అందుకే గాంధీ జయంతి రోజున జైలులోనే సత్యాగ్రహ దీక్ష చేస్తున్నారని తెలిపారు.

ఆదర్శప్రాయుడు మహాత్మా గాంధీజీ..

విశాలాంధ్ర-ధర్మవరం: భారతదేశానికి ఆదర్శనీయుడు మహాత్మా గాంధీజీ అని, ఆయన మార్గం ఆచరణీయమని సబ్ జైలు సూపరెంటెంట్ బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. సోమవారం సబ్జైల్లో ఖైదీల నడుమ గాంధీజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. అనంతరం బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ఎందరో సమరయోధుల బలిదానాలతో స్వాతంత్రం భారతదేశానికి వచ్చిందని తెలిపారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని భారతదేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని తెలిపారు. జైలుకు తెలిసి, తెలియక ఖైదీలుగా రావడం జరిగిందని, భవిష్యత్తులో నేరాలు చేయకుండా మంచి జీవితాన్ని గడపాలని తెలిపారు. ఖైదీల అందరూ మంచి ప్రవర్తనలో మార్పు రావాలని, అప్పుడే కుటుంబముతో సుఖవంతమైన జీవితాన్ని గడిపే అవకాశం ఉందని తెలిపారు. జీవితంలో వేసే ప్రతి అడుగు ఆలోచించి, మంచి మార్గంలో వెళ్లాలని సూచించారు. అనంతరం ఖైదీలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జైలు సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు.. పట్టణంలోని గాంధీ నగర్‌లో గల గాంధీ విగ్రహానికి గాంధీ జయంతి సందర్భంగా సిపిఐ నియోజక వర్గాల కార్యదర్శి మధు, పట్టణ కార్యదర్శి రవికుమార్, సహాయ కార్యదర్శి రమణ, చేనేత కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు వెంకటస్వామి, వెంకటనారాయణ లు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి ఏళ్ళు గడిచినా కూడా బడుగు వర్గాల అభివృద్ధి జరగలేదని, ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రాజా, నాయకులు బాల రంగయ్య, శ్రీనివాసులు, శ్రీధర్, ఆదినారాయణ, నాగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గాంధీ సిద్ధాంతాలు ఎందరికో స్ఫూర్తి

విశాలాంధ్ర-కొత్తచెరువు: మహాత్మా గాంధీ ఆలోచనలు సిద్ధాంతాలు భావాలు ఎందరికో స్ఫూర్తిగా నిలిచాయని శ్రీ సత్యసాయి జిల్లా డీఈవో మీనాక్షి తెలిపారు. డీఈవో కార్యాలయం వద్ద ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన దేశ స్వతంత్రం కోసం ఆయన చేసిన పోరాటాలు చరిత్రలో నిలిచిపోయాయి. అన్నారు. అహింస మార్గం ద్వారానే సహాయ నిరాకరణ సత్యాగ్రహము ఫిట్ ఇండియా ఇలాంటి ఉద్యమాలు నిర్వహించారు అన్నారు. ఆయన స్వయానా పత్రికలు కూడా నడిపే బ్రిటిష్ వారు అనుసరిస్తున్న నియంత్రణ విధానాలను పత్రికల ద్వారా ప్రజలకు తెలియచెప్పరన్నారు. ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ రెడ్డప్ప, ఉపాధ్యాయులు చంద్ర, మనోహర్, లలిత, శ్రీనివాసులు, మల్లికార్జున, కాంగ్రెస్ నాయకులు బెల్లం నజీర్, మారాల ఓబులేసు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగాగాంధీ, శాస్త్రి జయంతి వేడుకలు

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ బార్ అసోసియేషన్ నందు అసోసియే షన్ అధ్యక్షులు నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం మహాత్మా గాంధీ మరియు లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు సీనియర్ సివిల్ జడ్జి శంకర్ రావు, జడ్జ్ ముజీబ్ పసల సయ్యద్ పాల్గొని గాంధీ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. దేశాన్ని ప్రపంచ దేశాలకు దీటుగా, పోటీగా తీసుకెళ్లిన మహానేతలను గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియే షన్ అధ్యక్షులు నాగరాజు, న్యాయవాదులు, మోహన్ నాయక్, శివశర్మ, నాగిరెడ్డి, శ్రీనివాసులు, శ్రీనివాస్, కిరణ్ కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర్ నారాయణ మహాత్మా గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు.

విశాలాంధ్ర-లేపాక్షిలో..

చంద్రబాబు.. గాంధీ చూపిన మార్గంలో నడిచే నేత

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ నియోజకవర్గం నందు సోమవారం గాంధీ జయంతి సందర్భాన్ని పురస్కరిం చుకొని టీడీపీ నాయకులు సిపిఐ జనసేన నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నిరసన దీక్ష చేపట్టారు కార్యకర్త లను ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ మా నాయకుడు చంద్రబాబు నాయుడిని అక్రమంగా, అన్యాయంగా అరెస్టు చేశారని అన్నారు. గాంధీ జయంతిని పురస్క రించుకుని చంద్రబాబు రాజమండ్రి సెంట్రల్ జైల్లో నిరాహార దీక్ష చేస్తుం డగా లోకేష్ ఢిల్లీలో నిరాహార దీక్ష చేస్తుండగా మేము కూడా నిరాహార దీక్ష చేపట్టామని అన్నారు. చంద్రబాబు గాంధీ మార్గంలో నడిచే వ్యక్తి అని.. శాంతియుత మార్గంలో ప్రజలను నడిపించే వ్యక్తిగా అభివృద్ధి ప్రదాతగా ప్రపంచంలోనే వెలుగొం దాడని, ఆయన్ను రాక్షసంగా అరెస్టు చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు సిపిఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు మాజీ ఎంపీపీ సత్య నారాయణ వడ్డెర సాధికారిక సమితి అధ్యక్షుడు హనుమయ్య పాల్గొన్నారు.

సిపిఐ ఆధ్వర్యంలో గాంధీ జయంతి..

విశాలాంధ్ర-గోరంట్ల: గోరంట్ల పట్టణంలో సిపిఐ పార్టీ సభ్యులు మహాత్మా గాంధీకి పూల మాలలు వేసి నివాళులర్పించారు, ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సుధాకర్, సహాయ కార్యదర్శి సురేష్ బాబు, పవర్లూమ్ కార్మిక పోరాట సమితి సభ్యులు రామకృష్ణ, మనోహర్, వెంకటేష్, శంకర, మహేష్, బాబు, మల్లికార్జున పాల్గొన్నారు.

లేపాక్షి సర్పంచ్‌కు సన్మానం

విశాలాంధ్ర-లేపాక్షి: లేపాక్షి గ్రామ సచివాలయం లో సోమవారం ఉదయం గ్రామ సచివాలయం సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు గ్రామ సర్పంచ్ ఆదినారాయణను ఘనంగా సన్మానించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా భారత దేశంలో లేపాక్షి ఉత్తమ గ్రామంగా ఎంపికైన నేపద్యంలో సర్పంచ్ అవార్డు తీసుకున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే స్వచ్ఛ భారత్ సేవా కార్యక్రమంలో ఆయనను శాలువలు కప్పి పూలమాలలతో సత్కరించారు. ప్లాస్టిక్ రహిత గ్రామం గా తీర్చిదిద్దాలను సిబ్బందికి తెలియజేసారు.

చిలమత్తూర్ రూరల్‌లో దీక్షలు చేపట్టిన టీడీపీ నేతలు

టీడీపీ నేతల మౌన దీక్ష..

విశాలాంధ్ర-చిలమత్తూర్ రూరల్: టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ చిలమత్తూర్ టిడిపి నాయకుల ఆధ్వర్యంలో సోమవారం మౌన దీక్ష చేపట్టారు. ఈ నేపథ్యంలో పలువురు దీక్ష శిబిరం వరకు నల్లజెండా లతో ప్రదర్శన చేస్తూ రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తున్న వారికి సంఘీభావం తెలిపారు. ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర, పార్టీ పరిశీలికులు నరసింహారావు, హాజరై మాట్లాడుతూ అన్యాయంగా దొంగ కేసులు పెట్టి బాబుని జైల్లోపెట్టారని, ఆరోపించారు. గాంధీ జయంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులర్పించారు. ఈకార్య క్రమంలో మాజీ రాష్ట్ర కార్యదర్శి అంజినప్ప ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి బేకరీ గంగాధర్, అనుబంధ సంఘాల కోఆర్డినేటర్ విశ్వనాథ్‌రెడ్డి, పార్లమెంట్ మహిళా ఉపాధ్యక్షురాలు శ్రీదేవి,నరేంద్రపాల్గొన్నారు.

అగళి మండల కేంద్రంలో..

టీడీపీ నాయకుల శిరో ముండనం

విశాలాంధ్ర - అగళి : చంద్రబాబు అక్రమ అరెస్టు ను నిరసిస్తూ వివిధ రకాలుగా నిరసన తెలుపుతూ పార్టీ కి అండగా నిలుస్తూ అభిమానాన్ని చాటుకొంటున్నారు. మండలకేంద్రంలోని ఎన్టిఆర్ విగ్రహం ముందు చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని ఆకారణంగా అక్రమంగా చంద్రబాబును అరెస్టు చేసారని దుయ్య బట్టారు. మరో అడుగు ముందుకు వేసి నాయకులు శిరోముండనం చేయించుకొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఉమేష్ కన్వీనర్ కుమార్ స్వామి మాజీ సింగల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి చేస్తాం..

విశాలాంధ్ర-సోమందేపల్లి: మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీ గ్రామ సభను సర్పంచ్ గంగాదేవి నరసింహా మూర్తి అధ్యక్షతన సోమవారం నిర్వహిం చారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం పని చేస్తుందని దానికి నిదర్శనమే సచివాలయ వ్యవస్థ అన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యతనివ్వండి..

విశాలాంధ్ర-రొళ్ల: రైతులు రసాయనిక ఎరువులు మందులకు స్వస్తి పలికి ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఆర్.వద్రహట్టి గ్రామ సమీపంలో రైతులు నాగరాజు, హనుమంతరాయ, కరియమ్మ ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన కంది, అలసంద, ఆముదం, అనప, గోరు చిక్కుడు ఇతర పంటలను వారు పరిశీలించారు. రైతులు ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం నిజంగా అభినందనీయమని భవిష్యత్తులో ఇలాగే మరింత మంది ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయా లని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించే దిశగా రైతులు పంటలను సాగు చేసి అధిక లాభాలను ఆర్జించాలని సూచించారు. కార్యక్రమంలో శాసనసభ్యులు డాక్టర్ ఎం.తిప్పేస్వామి, కలెక్టర్ అరుణ్ బాబు,సబ్ కలెక్టర్ కార్తీక్, డిపిఓ విజయ్‌కుమార్, ఎంపీపీ కవిత విజయరంగేగౌడ్, జడ్పిటిసి సభ్యుడు అనంతరాజు,తహసీల్దార్ హసీనా సుల్తానా, ఎంపీడీవో ఆజాద్,సిఐ సురేష్ బాబు,ఎస్సైలు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత కొండకమర్ల

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు : పుట్టపర్తి నియోజకవర్గం వైసీపీ మాజీ సమన్వయకర్త, సిఈసి సభ్యులు కొత్తకోట సోమశేఖర్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా సెప్టెంబరు 8న పుట్టపర్తిలో జిల్లా స్థాయి వైయస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. క్రికెట్ టోర్నీలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో కొండకమర్ల, ఓడిసి బాబ్బాన్ లెవెన్ జట్లు తలపడ్డాయి. తొలిత బ్యాటింగ్ చేసిన కొండకమర్ల జట్టు నిర్ణీత 16 ఓవర్లకు 131 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఓడీసీ బాబ్బాన్ లెవెన్ జట్టు 14.5 ఓవర్లకు కేవలం 56 పరుగులు మాత్రమే చేయగలిగింది. క్రికెట్ టోర్నీ నిర్వాహకులు, వైసీపీ యువనేత కొత్తకోట చక్రధర్‌రెడ్డి హాజరై టోర్నీని తిలకించారు. కొత్తకోట చక్రధర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. మండల స్థాయి టోర్నీ విజేత జట్టుకు రూ.15 వేలు రన్నర్ జట్టుకు రూ.10 వేల నగదు బహు మతిని పుట్టపర్తిలో జరిగే జిల్లాస్థాయి క్రికెట్ ఫైనల్ పోటీ రోజున ఈ ప్రోత్సాహక నగదు బహు మతిని అందజేయనున్నట్లు తెలిపారు. క్రికెట్ టోర్నీ నిర్వాహకులు సామల మోహన్‌రెడ్డి, బత్తల శీన, వీర, వినయ్‌రెడ్డి తోపాటు క్రికెట్ టోర్నీ నిర్వహిణకు సహకరించిన యువతను అభినందించారు.

అమడగూరు ఎస్.ఐ.గా బలరామయ్య

విశాలాంధ్ర-అమడగూరు: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ నూతన ఎస్.ఐ.గా బలరామయ్య సోమవారం బాధ్యతలను చేపట్టారు. ఉన్నతాధికా రుల ఆదేశాల మేరకు ఎస్.ఐ.ల అటా చ్మెంట్ బదిలీలలో భాగంగా పుట్టపర్తి వి.ఆర్‌లో విధులు నిర్వహిస్తూ ఇక్కడికి రావడం జరిగిందని, గతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్.ఐ. వెంకట నారా యణను గాండ్లపెంటకు బదిలీ చేయడం జరిగిందన్నారు. నూతన ఎస్ఐకి ఎ.ఎస్.ఐ. ధనంజయ, హెడ్ కానిస్టేబుల్ సుధాకర్, మున్ని, భాస్కర్, రత్నాకర్, భార్గవ ఆయనకు ఘన స్వాగతం పలికారు.

ప్రోటోకాల్ పాటించలేదని ఉపసర్పంచ్ అసహనం

విశాలాంధ్ర-సోమందేపల్లి : స్థానిక మేజర్ పంచాయతీలో సోమ వారం నిర్వహించిన గ్రామసభ సమావేశంలో ప్రోటోకాల్ పాటించ కుండా సమావేశంలో తనకు సీటు కేటాయించలేదని అనర్హులను గ్రామసభ కుర్చీలలో కూర్చోబెట్టారని దీని నిరసిస్తూ ఉప సర్పంచ్ వేణు ప్రజలు కూర్చునే కూర్చిలోనే కూర్చుని నిరసన వ్యక్తం చేశారు.

జాతిపిత ఆశయాల సాధనకు కృషి చేద్దాం

విశాలాంధ్ర-రాప్తాడు: జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాల సాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించు కుని సోమవారం అనంతపురంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో రాప్తాడు నియోజకవర్గంలోని ఎంపీపీలు, జడ్పిటిసి సభ్యులు, పార్టీ మండల కన్వీనర్లు, ఇతర ముఖ్య నాయకులతో కలిసి గాంధీజీ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీ కలలను రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం సాకారం చేస్తోందన్నారు. సచివాలయాల వ్యవస్థ, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా సీఎం వైయస్ జగన్ గ్రామ స్వరాజ్యానికి నాంది పలికారన్నారు. అనంతరం నియోజకవర్గంలోని అన్ని మండలాల వైసీపీ కొత్త కన్వీనర్లు, అనుబంధ సంఘాల కమిటీల్లో చోటు దక్కించుకున్న నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.